సాక్షి మెదక్

బుధవారం । 21 । ఆగస్టు । 2024



డివైడర్‌ను ఢీకొన్న కారు

సోదరుడికి రాఖీ కట్టేందుకు భర్తతో కలిసి పుట్టింటికి వెళ్తుండగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది.

వివరాలు 8లో ▸



సహాయం చేయబోతే..

రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు సాయం చేస్తుండగా ఆటో ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

వివరాలు 8లో ▸



భారీ వర్షాల పట్ల అప్రమత్తం

భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి కలెక్టర్‌కు సూచించారు.

వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

విద్యార్థులకు కంటి పరీక్షలు

నర్సాపూర్: విద్యార్థులలో కంటిచూపు లోపాలను గుర్తించేందుకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు చేపడుతున్నామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సృజన తెలిపారు. మంగళవారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాల విద్యార్థినిలకు కంటి పరీక్షలు చేపట్టారు. స్క్రీనింగ్ టెస్టులో అద్దాలు అవసరమైన వారిని గుర్తించి వాటి కోసం సిఫార్సు చేసినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇంతెజార్, పారామెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ రాజయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేకర్, ఏఎన్ఎంలు భాగ్య, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌కు నివాళి



రాజీవ్‌గాంధీకి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: దివంగత ప్రధానమంత్రి రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ నాయకులు నివాళులు అర్పించారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి పలువురు నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మల్లేశ్, పార్టీ నాయకులు శేషాసాయిరెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, లలిత, కమల, శ్రీనివాస్‌గౌడ్, ఉదయ్‌కుమార్, శ్రీనివాస్‌గుప్తా, నవీన్‌గుప్తా, హ బీబ్‌కాన్, రవీందర్‌గౌడ్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.

26న క్రిస్టియన్ల రాష్ట్ర సదస్సు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేఏసీ చైర్మన్ రవికుమార్, తదితరులు

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ క్రిస్టియన్ల సమస్యలపై ఈ నెల 26న హైదారాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ జిలకర రవి కుమార్ తెలిపారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలం అంబాజిపేటలోని చర్చిలో జేఏసీ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ దాసరి శ్యామ్‌రావుతో కలిసి సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు క్రైస్తవులకు ఇచ్చిన హామీలను చేయాలని ఆయన కోరారు కార్యక్రమంలో పాస్టర్ భిక్షుల ఉదయ్ కుమార్, హనోక్, బ్రదర్ రాహుల్, బందెల సాయిలు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలించిన సీఈఓ



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

నర్సాపూర్: జిల్లా పరిషత్ సీఈఓ ఎల్లయ్య మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ రికార్డులు పరిశీలించారు. వార్షిక పరిశీలనలో భాగంగా రికార్డులు పరిశీలించారని, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ పథకాల వివరాల నమోదు బాగుందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సీఈఓ ఎల్లయ్య వెంట డిప్యూటీ సీఈఓ రంగాచారి, జెడ్పీ సూపరింటెండెంట్ మాణయ్య ఉన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి



నాగరాజుకు ఆర్డర్ కాపీ అందజేస్తున్న డీఈ కృష్ణారావు

మెదక్ కలెక్టరేట్: ప్రమోషన్ పొందిన వారిపై మరింత బాధ్యత పెరుగుతోందని ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ట్రాన్స్‌కో డీఈ కృష్ణారావు సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో లైన్‌మెన్ నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రమోషన్ పొందిన ఆకుల నాగరాజుకు డీఈ ఆర్డర్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతాయుతంగా పనిచేస్తే మరిన్ని ప్రమోషన్లు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం మెదక్ డివిజన్ కార్యదర్శి అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జంబికుంట వద్ద మొక్కలు నాటుతున్న షేక్ రజాక్, తదితరులు

అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి

ఎన్‌హెచ్ఏఐ ఆర్ఓ రజాక్

పెద్దశంకరంపేట(మెదక్): మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ అందరి బాధ్యత అని ఎన్ఏహెచ్ఏఐ హైదరాబాద్ రీజినల్ అధికారి షేక్ రజాక్ అన్నారు. మంగళవారం జంబికుంట వద్ద పీడీ మధుసూదన్‌రావు, జాయింట్ అడ్వైజర్ రాజారావు, మహ్మద్ రహమాన్, రవిశంకర్, విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని సూచించారు. నేషనల్ హైవే ఆధ్వర్యంలో రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్యాబ్ హైవేస్ రీజినల్ హెడ్ వసుంధర, శంకరంపేట ప్రాజెక్ట్ లిమిటెడ్ హెడ్ ప్రభాకర్‌రెడ్డి, ఐఎంఎస్ మేనేజర్ ఖాజామోయినొద్దీన్ పాల్గొన్నారు.

మరో రెండు డయాలసిస్ కేంద్రాలు

- నర్సాపూర్, తూప్రాన్ ఆస్పత్రుల్లో ఏర్పాటు
- కిడ్నీ రోగులకు మరింత మెరుగైన సేవలు
- తప్పనున్న దూరభారం
- జిల్లావ్యాప్తంగా 150 మంది బాధితులు

వైద్య సేవలు మరింత మెరుగు పరిచేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టింది. జిల్లాకు మరో రెండు డయాలసిస్ (రక్తశుద్ధి) కేంద్రాలను మంజూరు చేసింది. అష్టకష్టాలు పడి చికిత్స పొందుతున్న కిడ్నీ రోగులకు ఇది శుభవార్తే.. ఇప్పటికే జిల్లా కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ఉండగా మరో రెండు కేంద్రాలు మంజూరు కావడంతో వైద్యం మరింత చేరువకానుంది. – మెదక్‌జోన్



జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రంలో చికిత్స పొందతున్న కిడ్నీ రోగులు

జిల్లా వ్యాప్తంగా 150 మందికిపైగా కిడ్నీ రోగులు ఉన్నారు. వీరికోసం 2017లో జిల్లా కేంద్ర ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్న మెదక్, హవేళిఘనాపూర్, చిన్నశంకరంపేట, చేగుంట, కొల్చారం, పాపన్నపేట, టేక్మాల్ తదితర మండలాలకు చెందిన 68 మంది డయాలసిస్ పేషెంట్లు వచ్చి రక్తశుద్ధి చేయించుకుంటున్నారు. వీరిలో వ్యాధితీవ్రతను బట్టి కొంత మంది వారానికి 2 సార్లు, మరికొంత మంది వారానికి 3 సార్లు వచ్చి చికిత్స పొందుతున్నారు. ఒక్కో పేషెంట్‌కు డయాలసిస్ చేయాలంటే 4–5 గంటల సమయం పడుతుంది. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో 10 బెడ్స్ మాత్రమే ఉండటంతో నిత్యం మూడు సిఫ్టుల ద్వారా 20 నుంచి 25 మంది చికిత్స పొందుతున్నారు. డయాలసిస్ చేసేందుకు ఒక్కరికి 5 గంటల సమయం పట్టడంతో కాస్త ఆలస్యంగా వస్తే 10 గంటల నుంచి 15 గంటల వరకు రోగులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

చేసేది లేక ఇతర ప్రాంతాలకు..

జిల్లా కేంద్రంలో తక్షణం డయాలసిస్ అందకపోవడంతో కిడ్నీ రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. రామాయంపేట, నిజాంపేట మండలాలకు చెందిన రోగులు కామారెడ్డికి వెళ్తుండగా, తూప్రాన్, మనోహరబాద్ మండలాలకు చెందిన వారు గజ్వేల్‌కు వెళ్తున్నారు. నర్సాపూర్, చిలిపిచెడ్ మండలాల వారు హైదరాబాద్ లోని సూరారం ప్రాంతంలోని మల్లారెడ్డి ఆస్పత్రులకు వెళ్తున్నారు.

ఐదు బెడ్స్ చొప్పున..

కిడ్నీ రోగుల ఇబ్బందులను గుర్తించిన వైద్య ఆరోగ్య శాఖ రెండు డయాలసిస్ కేంద్రాలు మంజూరు చేసింది. నర్సాపూర్, తూప్రాన్ ఏరియా ఆస్పత్రులకు 5 బెడ్స్‌చొప్పున ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. దీంతో ఆప్రాంతంలోని వ్యాధిగ్రస్తులకు దూరభారం తప్పనుంది. మరోవైపు డయాలసిస్ చికిత్స ఆరోగ్యశ్రీ కార్డుపై ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. ఒక్కో పేషెంట్‌కు నెలకు రూ. 25 వేల నుంచి రూ. 30 వేల ఖర్చు అవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు.

రోగులకు ఎంతో మేలు..



జిల్లాలోని నర్సాపూర్, తూప్రాన్ ఆస్పత్రులకు 5 బెడ్లచొప్పున డయాలసిస్ సెంటర్లు మంజూరు అయ్యాయి. దీంతో రోగులకు ఎంతో మేలు జరగనుంది. దూరభారం, గంటల తరబడి నిరీక్షణ తప్పనుంది. ఆయా కేంద్రాల్లో రోగులకు వెంటనే చికిత్స అందిస్తాం.

–డాక్టర్ శివదయాల్, డీసీహెచ్

మహిళల ఫుట్‌బాల్ జట్టుకు కలెక్టర్ అభినందనలు



ఫుట్‌బాల్ జట్టుకు కప్‌ను అందిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: ఉమ్మడి మెదక్ జిల్లా మహిళల ఫుట్‌బాల్ జట్టును కలెక్టర్ రాహుల్‌రాజ్ అభినందించారు. తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల16 నుండి 20వరకు నిజామాబాద్‌లో రాష్ట్రస్థాయి మహిళల ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఉమ్మడి మెదక్‌జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచింది. మంగళవారం కలెక్టర్ తన చాంబర్లో క్రీడాకారులను, అలాగే జాతీయస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ విభాగంలో బంగారు పతకం సాధించిన అంకిత్‌ను అభినందించారు. అలాగే ఉమ్మడి మెదక్‌జిల్లా నుండి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న సంయుక్త కార్యదర్శి నగేశ్, శిక్షకులు ప్రకాశ్, భాగ్యమ్మ, వినయ్, బాణి, ఫుట్‌బాల్ అకాడమీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీడీ నాగరాజుతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కరెంట్ లేక నిలిచిన సేవలు

- కాలిపోయిన ఎంపీడీఓ కార్యాలయ కరెంట్ తీగ
- నాలుగు రోజులైనా పునరుద్ధరించని వైనం
- పట్టించుకోని ఎంపీడీఓ
- ప్రజాపాలనకు వచ్చి వెనుదిరుగుతున్న జనం



హవేళిఘణాపూర్(మెదక్): ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రజలకు మంచి సేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తుంటే మెదక్ ఎంపీడీఓ కార్యాలయ అధికారి మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవలే ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం ద్వారా గృహలక్ష్మి, గ్యాస్ సబ్సిడీ కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తే వివిధ పథకాల కోసం వచ్చి వెనుదిరగాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఎందుకంటే.. కార్యాలయానికి వచ్చే వైరు కాలిపోయి నాలుగు రోజులుగా కరెంటు సరఫరా నిలిచిపోయింది. కార్యాలయ పనులు ఎక్కడికక్కడ స్తంభించినా అధికారులకు చీమకుట్టినట్లయినా లేదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

మెదక్ ఎంపీడీఓ కార్యాలయానికి సరఫరా అయ్యే వైరు శుక్రవారం మధ్యాహ్నం కాలిపోయింది. దీనిని వెంటనే సరిచేసుకోవాల్సి ఉండగా వైరు అందుబాటులో లేదనే సాకుతో మంగళవారం వరకు సరఫరా లేకుండా అలానే నెట్టుకొస్తున్నారు. మూడు రోజులుగా కంప్యూటర్ ఆపరేటర్లు కార్యాలయానికి వచ్చి ఖాళీగా కూర్చొని వెళ్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ సైతం పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గంటపాటు కరెంటు లేకపోతే అసలు ఉండలేం.. మరీ నాలుగు రోజులుగా లేదా? అని సాధారణ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇదంతా చూస్తూ కూడా ఎంపీడీఓ తనకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. నిత్యం కార్యాలయానికి సంబంధించిన రిపోర్టులతో పాటు ఇటీవలే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాలను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలందాయి. ఈ నేపథ్యంలో ఎంపీడీఓ ఆఫీస్‌కు మంగళవారం సాయంత్రం వరకు కరెంటు సరఫరా లేదు. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మెదక్ ఎంపీడీఓ కార్యాలయం దుస్థితే ఇలా ఉంటే.. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఉండే కార్యాలయాల పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

దర్యాప్తు పారదర్శంగా జరగాలి

ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి



పోలీసు వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: ప్రతి కేసులో లోతైన దర్యాప్తు చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ జరిగినప్పుడే త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రతి కేసులో పారదర్శకంగా దర్యాప్తు చేయాలన్నారు. పాక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. అనంతరం సైబర్ నేరాల నియంత్రణ, సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే రాబోయే వినాయక పండుగ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అనంతరం మెదక్ జిల్లా సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్, ఆర్ఐ శైలేందర్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలు, పోలీస్ వాహనాలు, అధికారుల వాహనాల పనితీరును ఎస్పీ పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్ , తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్, సీఐలు ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుపాయల్లో నేరాలు జరగొద్దు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల్లో ఎలాంటి నేరాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఏడుపాయల్లో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మంజీరనదిలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నదిలో స్నానపు ఘాట్లు నిర్మించి, చుట్టూరా ఫెన్సింగ్ వేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన నిధులు అవసరం అవుతాయని, ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొందాలని ఈఓ కృష్ణప్రసాద్ తెలిపారు. ఏడుపాయల్లో నేరాలు జరగకుండా సీసీ కెమెరాలు, సెక్యూరిటీ పెంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఏడుపాయల ఈఓగా చంద్రశేఖర్

3 నెలల్లో ముగ్గురు ఈఓలు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనదుర్గా భవానీ ఆలయ ఈఓలు నెలకోసారి మారుతున్నారు. ఇటీవల 3 నెలల్లో ముగ్గురు ఈఓలు మారారు. ప్రస్తుతం తాజాగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అడిసనల్ కమిషనర్ చంద్రశేఖర్‌కు ఏడుపాయల ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సంకాపూర్ రైల్వేస్టేషన్‌లో రైళ్లు నిలపాలి

ఎంపీకి వినతి



ఎంపీ రఘునందన్‌రావుకు వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలం సంకాపూర్ రైల్వే స్టేషన్‌లో రైళ్లను నిలిపేలా చర్యలు చేపట్టాలని మెదక్ ఎంపీ రఘునందన్‌కు సంకాపూర్, ఖాజాపూర్ గ్రామాల బీజేపీ నాయకులు వినతి పత్రం అందించారు. కరోనా సమయంలో రైల్వేస్టేషన్‌లో రైళ్లను నిలపడం అధికారులు రద్దు చేశారన్నారు. సికింద్రాబాద్-నిజామాబాద్ మధ్యలో ప్రయాణించే లోకల్ రైళ్లను సంకాపూర్ రైల్వేస్టేషన్‌లో నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో బీజేపీ నాయకులు నరేందర్‌రెడ్డి, పండరగిగౌడ్, స్వామిగౌడ్, రాజు, మోహన్ ఉన్నారు.

శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు

- డ్రోన్‌తో మందుల వాడకంపై అవగాహన
- ఐఐఎంఆర్ శాస్త్రవేత్తలు

టేక్మాల్(మెదక్): గ్రామాల్లోని రైతులు వ్యవసాయంలో శాస్త్రీయ విధానాన్ని పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చని ఐఐఎంఆర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్) శాస్త్రవేత్తలు గంగయ్య, రాజేశ్, రఫీ పిలుపునిచ్చారు. టేక్మాల్ రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కుసంగి గ్రామ రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. రైతులకు డ్రోన్ ద్వారా మందుల పిచికారీ గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. తక్కువ సమయంలో మందులను పిచికారీ చేయవచ్చునన్నారు. సంఘంలోని రైతులకు రెండున్నర ఎకరాల వరకు ఉచితంగా పిచికారీ చేస్తామని, అంతకు మించితే రూ.500ల చొప్పున తీసుకుంటామని చెప్పారు. రైతులు మందులు వారే తెచ్చుకోవాలని, రెండెకరాలలోపు ఉంటే ఎకరాకు రూ.1300లు సంఘం ద్వారా ఇస్తామని తెలిపారు. తక్కువ నీరు, తక్కువ సమయంలో పిచికారీ పూర్తి అవుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఇంద్రయ్య, పెద్దలు యూసుఫ్, సంగమేశ్వర్ గౌడ్, అంజయ్య, మొఘల్ రెడ్డి, మల్లయ్య, మండల రైతు సంఘం చైర్మన్ మొగులయ్య, సీఈవో వెంకటేశం, డైరెక్టర్లు దత్తు, సుభాష్, ఎల్లయ్య, రాములు, అకౌంటెంట్ లక్ష్మీనారాయణ, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పచ్చని పొలాల్లో కెమికల్ మంట

- ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకున్న రైతులు
- అర్ధాంతరంగా ముగించి వెళ్లిపోయిన జేసీ



ప్రజాభిప్రాయ సేకరణలో పరిశ్రమ వద్దంటూ ఆందోళన చేస్తున్న రైతులు, గ్రామస్తులు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న జేసీ

శివ్వంపేట(నర్సాపూర్): పచ్చని పంట పొలాల్లో రసాయన పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణను రైతులు అడ్డుకున్నారు. ఈ సంఘటన మండల పరిధి నవాబుపేట పంచాయతీ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామ శివారులో హెపా లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-1 ఏర్పాటు చేసేందుకు పీసీబీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి జేసీ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. పరిశ్రమ ఏర్పాటు తదితర అంశాల గురించి ఎన్జీవోలు, నిర్వాహకులు వివరించారు.

పరిశ్రమ వద్దంటూ రైతుల అడ్డగింత

నవాబుపేట పంచాయతీ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కెమికల్ పరిశ్రమ ఇక్కడ స్థాపించవద్దంటూ రైతులు అడ్డగించారు. చుట్టుపక్కల గ్రామాల రైతులకు పరిశ్రమ నిర్మాణంపై ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇతర ప్రాంతాల నుంచి వివిధ వర్గాలకు చెందిన వారితో పాటు ఎన్జీవోలను డబ్బులిచ్చి ప్రజాభిప్రాయ సేకరించడం ఏమిటని ప్రశ్నించారు. రసాయన పరిశ్రమ నిర్మిస్తే ఇక్కడి సాగు భూములు బీడుగా మారుతాయని గ్రామస్తులు రవిగౌడ్, రాజిరెడ్డి, కృష్ణ, నాగిరెడ్డిగూడం మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, నల్లవల్లి మాజీ ఎంపీటీసీ ప్రభాకర్‌రెడ్డి, రైతులు పేర్కొన్నారు. ఇప్పటికే గ్రామ శివారులో ఉన్న రసాయన పరిశ్రమల వల్ల చెరువు, కుంటల నీటితో పాటు బోరుబావుల్లోని నీరు కలుషితం అయ్యాయన్నారు. స్థానికేతరులు వచ్చి పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలంగా వ్యవహరిస్తుండటం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమ వద్దంటూ రైతులు ఆందోళన చేయడంతో జేసీ వెంకటేశ్వర్లు అర్ధంతరంగా ప్రజాభిప్రాయ సేకరణను ముగించి వెళ్లిపోయారు. స్థానిక, సమీప రైతుల ఆమోదం ఉంటేనే పరిశ్రమ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

గుట్టు చప్పుడు కాకుండా ప్రజాభిప్రాయ సేకరణ

ఈ రసాయన పరిశ్రమ గురించి మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ విషయం స్థానికులకు గానీ, మీడియాకు పీసీబీ అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. గుట్టు చప్పుడు కాకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం ఏమిటని పలువురు ప్రశ్నించారు. దీనిపై పీసీబీ రామచంద్రపురం ఈఈ కుమార్‌పాటీను వివరణ కోసం ఫోన్ చేయగా స్పందించలేదు.

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


స్వామి (ఫైల్‌)

రాయపోలు(దుబ్బాక): చేపల వేటకు వెళ్లి వలలో చిక్కుకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన రాయపోలు మండలం వీరానగర్‌లో చోటుచేసుకుంది. రాయపోలు ఎస్సై రఘుపతి తెలిపిన వివరాల మేరకు.. వీరానగర్‌కు చెందిన నిమ్మరాజు స్వామి (40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లో భోజనం చేసిన తర్వాత చేపలు పట్టుకుస్తానని ఇంట్లో చెప్పి స్థానికంగా ఉన్న తుమ్మకుంట చెరువులోకి వెళ్లాడు. అందులోకి వల విసిరి దిగేసరికి కాళ్లకు వల చిక్కుకొని చెరువులో మునిగిపోయాడు. విషయాన్ని గమనించిన స్థానికులు రక్షించడానికి చెరువులోకి దిగేసరికి అప్పటికే పూర్తిగా అతను మృతిచెందాడు. పోలీసులకు సమాచారం అందించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య లావణ్యతో పాటు ఓ కొడుకు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గాయపడిన యువకుడి ..


ప్రవీణ్‌కుమార్‌ (ఫైల్‌)

పెద్దశంకరంపేట(మెదక్‌): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతిచెందాడు. ఇటీవల నారాయణఖేడ్‌ నుంచి పెద్దశంకరంపేట వైపు బైక్‌పై వస్తున్న యువకులు ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో యువకుడు విలాస్‌ సంఘటనా స్థలంలోనే చనిపోగా ప్రవీణ్‌కుమార్‌ తీవ్ర గాయాలు కాగా అతడు గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మండల పరిధిలోని కొత్తాపేటకు చెందిన ప్రవీణ్‌కుమార్‌ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలున్నారు. పీసీసి సభ్యులు కర్నె శ్రీనివాస్‌ గాంధీ ఆస్పత్రిలో ప్రవీణ్‌ మృతదేహానికి నివాళర్పించి, కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌ విజయరావు, సోషల్‌మీడియా కో–ఆర్డినేటర్‌ విజయ్‌, సంగమేశ్వర్‌, సతీశ్‌ తదితరులున్నారు.

గుండెపోటుతో అంగన్‌వాడీ ఆయా ..


భూమమ్మ (ఫైల్‌)

అక్కన్నపేట(హుస్నాబాద్‌): గుండెపోటుతో అంగన్‌వాడీ ఆయా మృతిచెందింది. అక్కన్నపేట మండలం చౌటపల్లిలోని అంగన్‌వాడీ సెంటర్‌–2లో ఆయా చుంచు భూమమ్మ(58) 31 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తుంది. ఉదయం అంగన్‌వాడీకి వచ్చిన ఆమెకు గుండెపోటు రావడంతో కుప్పకూలింది. స్థానికులు గమనించి వెంటనే హుస్నాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యపరీక్షలు నిర్వహించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కనకయ్య (ఫైల్‌)

వర్గల్‌(గజ్వేల్‌): మండలంలోని గౌరారం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందాడు. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ములుగుకు చెందిన ఎర్రన్న కనకయ్య(38) శనివారం రాత్రి బైక్‌ మీద భార్య విజయ, కుమారుడు వరుణ్‌తో కలిసి ప్రజ్ఞాపూర్‌ నుంచి ములుగుకు వస్తున్నాడు. మార్గమధ్యలో గౌరారం హోటల్‌ వద్ద బండిని పార్క్‌ చేస్తుండగా హైదరాబాద్‌ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొడుతూ ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కనకయ్యను లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అప్రమత్తంగా ఉండండి

- కలెక్టర్‌కు రాహుల్‌రాజ్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డి, సీఎస్‌ శాంతికుమారి ఆదేశం


కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌, అధికారులు

మెదక్‌జోన్‌: భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్‌ శాంతికుమారి కలెక్టర్‌కు సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్‌, ధరణి, ఆర్‌ఓఆర్‌ చట్టంపై ఖమ్మం నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సచివాలయం నుంచి సీఎస్‌ శాంతికుమారి.. కలెక్టర్‌, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సమాచారం ఉందన్నారు. వాతావరణ శాఖ అధికారుల సూచన మేరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

- ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి దరఖాస్తులు పెండింగ్‌ లో ఉన్నాయన్నారు. వీటిని నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. సిబ్బంది కొరత ఉన్నచోట అవసరమైతే తాత్కాలిక ప్రాతిపదికన అదనపు సిబ్బందిని నియమించుకొని పనులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తుల ప్రకారం అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌ ప్రక్రియ ద్వారా ఎక్కడ ప్రభుత్వ భూమికి నష్టం కలగవద్దన్నారు.
- ధరణి పోర్టల్‌లో.. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల స్క్రూటీనీని పూర్తి చేసి మిగతా వాటిని పరిష్కరించాలన్నారు. తిరస్కరిస్తే కారణాలు తెలియజేయాలన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నూతన ఆర్‌ఓఆర్‌ చట్టం ముసాయిదా బిల్లు ప్రతిపాదించిందన్నారు. జిల్లాల్లో ఆగస్టు 23, 24వ తేదీల్లో వర్క్‌ షాప్‌ నిర్వహించి, ముసాయిదా బిల్లులో చేయాల్సిన మార్పులు, మెరుగైన సూచనలు ఏవైనా ఉంటే ఫీడ్‌ బ్యాక్‌ ను రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శికి పంపాలని కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌, మున్సిపల్‌ కమిషనర్‌, జానకీరామ్‌సాగర్‌, డీఈఓ రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్‌ నామినేషన్లు వేగవంతం..

అన్ని పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇన్‌స్పైర్‌ పోటీల్లో పాల్గొనేలా చేయాలని కలెక్టర్‌ రాహుల్‌ రాజ్‌ అన్నారు. మంగళవారం జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ, జిల్లా సైన్స్‌ అధికారి రాజిరెడ్డిలతో కలిసి ఆయన కలెక్టరేట్‌లో ఇన్‌స్పైర్‌ మనక్‌ గోడ పత్రిక ఆవిష్కరించారు. జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల నుంచి 5 నామినేషన్ల చొప్పున ఆన్‌లైన్‌లో సెప్టెంబర్‌ 15వ తేదీ లోపు అప్‌లోడ్‌ చేయాలన్నారు. పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్‌ నిర్వహించి ఉత్తమమైన ఐదు ఆలోచనలను ఎంపిక చేస్తామన్నారు. ప్రతి పాఠశాల నుంచి 5 చొప్పున నామినేషన్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌ చేసేలా కృషి చేయాలన్నారు.

టెక్నాలజీ తెచ్చిన వ్యక్తి రాజీవ్‌గాంధీ


రాజీవ్‌ గాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ప్రభాకర్‌

హుస్నాబాద్‌: దేశంలోనే సాంకేతిక టెక్నాలజీ విప్లవాన్ని తెచ్చిన గొప్ప నాయకుడు రాజీవ్‌ గాంధీ అని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ కొనియాడారు. కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్‌ గాంధీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మహిళా నేతలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాభివృద్ధి కోసం శాస్త్ర, సాంకేతిక విద్య అత్యంత ఆవశ్యకమని విశ్వసించిన గొప్ప దార్శనికుడు రాజీవ్‌ గాంధీ అని కొనియాడారు. సమాచార విప్లవానికి నాంది పలికి కంప్యూటరీకరణ, సాంకేతిక సంస్కరణలు ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించారన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కును కల్పించారని, పంచాయతీరాజ్‌ సంస్థలను బలోపేతం చేశారన్నారు. పట్టణంలోని 7వ వార్డులో ఇటీవల విద్యుత్‌ షాక్‌తో మృతిచెందిన సయ్యద్‌ సాదిక్‌ కుటుంబానికి చెక్కును మంత్రి అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌ విండో చైర్మన్‌ బొలిశెట్టి శివయ్య, మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, సరోజన, కోమటి స్వర్ణలత, వల్లపు రాజు, కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

ప్రమోషన్‌ ఇవ్వాలి

ట్రాన్స్‌కో ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ఆర్టిజన్‌ల ధర్నా


కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టిజన్‌లు

మెదక్‌ కలెక్టరేట్‌: అర్హులైన వారికి తప్పని సరిగా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్‌ చేస్తూ ఆర్టిజన్‌ కార్మికులు డిమాండ్‌ చేశారు. మంగళవారం మెదక్‌ జిల్లా కేంద్రంలోని ఎస్‌ఈ కార్యాలయం ఎదుట టీఎస్‌యూఈఈయూ(సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యాలయం ప్రతినిధికి వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్‌ గౌరవ అధ్యక్షుడు మహేందర్‌ రెడ్డి మాట్లాడుతూ, ఆర్టిజన్‌ కార్మికులకు స్టాండింగ్‌ ఆర్డర్‌ ప్రకారం 5 ఏళ్లు పూర్తయిన వారికి గ్రేడ్‌ ప్రమోషన్‌ ఇవ్వాలన్నారు. కానీ ఆరేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రమోషన్లు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆర్టిజన్‌ కార్మికులకు కన్వర్షన్‌ ఇవ్వాలని వినతులు సమర్పిస్తున్నా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, ఫాసి, సురేశ్‌, మల్లేశ్‌, నాగరాజు, రాజిరెడ్డి, భూపల్‌ పాల్గొన్నారు.

తగ్గిన ఆదాయం రూ. 25 లక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో తలనీలాల హక్కుకు వేలం పాటలు నిర్వహించగా రూ 61.20 లక్షల ఆదాయం వచ్చింది. మల్లన్న ఆలయంలో ఈ సంవత్సరం తలనీలాల హక్కుకు నాలుగు సార్లు ఆలయంలో వేలం పాటలు నిర్వహించగా సరైన పాట రాకపోవడంతో వాయిదా వేశారు. చివరగా మంగళవారం దేవాదాయ శాఖ కార్యాలయం హైదరాబాద్‌ నందు వేలం పాటలు నిర్వహించగా రుద్రా ఎంటర్‌ప్రైజెస్‌ దక్కించుకుంది. కాంట్రాక్టును అధికారులు కమిషనర్‌ ఉత్తర్వుల కోసం పంపించారు. ఆయన ఆమోదం తెలిపిన వెంటనే పాటదారునికి టెండర్‌ ఖరారు చేస్తామన్నారు. గతేడాది (2023–24) తలనీలాలు పోగు చేసుకునే లైసెన్స్‌ హక్కు ద్వారా ఆలయానికి రూ 86 లక్షల ఆదాయం రాగా ఈసారి గత ఏడాది కంటే రూ 25 లక్షల ఆదాయం తగ్గింది. కూరగాయల సరఫరా కోసం నిర్వహించిన లైసెన్స్‌ హక్కును అయినాపూర్‌కు చెందిన ఎ.గోపాల్‌ రూ 524లకు పాట పాడి దక్కించుకున్నారు.

రెండో రహదారి కోసం బైపాస్‌ నిర్మిస్తే

రామాయంపేటకు అన్యాయం

- మెదక్‌ ఎంపీ రఘునందన్‌


ఉన్నతాధికారులతో చర్చిస్తున్న ఎంపీ రఘునందన్‌

రామాయంపేట(మెదక్‌): రామాయంపేట మీదుగా నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి (765 డీజీ)ని బైపాస్‌ రోడ్డు నుంచి కాకుండా పట్టణం మీదుగా పాత రహదారిలో నిర్మించేలా ప్రయత్నిస్తున్నామని మెదక్‌ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. అనంతరం ఎంపీగా తొలిసారి రామాయంపేట వచ్చిన ఆయన మంగళవారం ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కృతజ్ఞత కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జాతీయ రహదారుల శాఖ అధికారులతో ప్రత్యేకంగా చర్చించి రోడ్డు నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ పరిశీలించారు. జాతీయ రహదారి నిర్మాణం విషయమై ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే 46వ జాతీయ రహదారి పట్టణానికి దూరంగా నిర్మించడంతో వ్యాపారాలు దెబ్బతిన్నాయన్నారు. రెండో రహదారి కోసం బైపాస్‌ నిర్మిస్తే పట్టణానికి అన్ని విధాలుగా అన్యాయం జరుగుతుందన్నారు. పట్టణం మీదుగా జాతీయ రహదారి నిర్మిస్తే ఎన్ని వ్యాపార సముదాయాలు, ఇళ్లు కోల్పోతాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెండు, మూడు రోజుల్లో సమగ్ర సర్వే రిపోర్టు అందజేస్తే బాధితులతో మాట్లాడుతానన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌, మెదక్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయకుమార్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌, రామాయంపేట, నిజాంపేట మండలాల అధ్యక్షులు దయానందరెడ్డి, చంద్రశేఖర్‌, పట్టణాధ్యక్షుడు భానుచందర్‌, సీనియర్‌ నాయకులు సుధాకర్‌రెడ్డి, శంకర్‌గౌడ్‌, వెల్ముల సిద్ధరాంలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి


జిల్లా స్థాయి విజేతలతో ఉపాధ్యాయులు

సిద్దిపేటఎడ్యుకేషన్‌: రాష్ట్రస్థాయి పోటీల్లోను సత్తా చాటాలని ఇందిరానగర్‌ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజాప్రభాకర్‌రెడ్డి, సోషల్‌ ఫోరం జిల్లా అధ్యక్షుడు పూర్ణచందర్‌రావు అన్నారు. మంగళవారం పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ, జిల్లా సోషల్‌ ఫోరం భాగస్వామ్యంతో వారధి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా స్థాయి ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారు ఆన్‌లైన్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఎంతో ప్రతిభ ఉంటే తప్ప మండల స్థాయి ని దాటి జిల్లా స్థాయికి రారన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఇప్పుడు సైతం ఉత్తమ ప్రతిభ కనబర్చారన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా సత్తాను చాటి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, రాంగోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్‌, నీరజ పాల్గొన్నారు. కాగా ఉపన్యాసంలో ఇందిరానర్‌ ఉన్నత పాఠశాల ప్రథమ, ఇర్కోడ్‌ మోడల్‌ స్కూల్‌ ద్వితీయ, గట్ల మల్యాల జెడ్పీహెచ్‌ఎస్‌ తృతీయ స్థానాల్లో నిలిచాయి. వ్యాసరచనలో బక్రిచెప్యాల జెడ్పీహెచ్‌ఎస్‌ ప్రథమ, గౌరవెల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ ద్వితీయ, నంగునూరు జెడ్పీహెచ్‌ఎస్‌ తృతీయస్థానంలో నిలిచాయి.

ఫొటోలు సజీవ సాక్ష్యాలు

సంగారెడ్డి జోన్‌: ఫొటోలు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయని టీఎస్‌ఐఐసీ రాష్ట్ర చైర్‌ పర్సన్‌ నిర్మల, కలెక్టర్‌ క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేశ్‌ పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కలెక్టరేట్‌ కార్యాలయంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు ఎత్తిచూపటంలో ఫొటోలు ఎంతో కీలకంగా వ్యవహరిస్తాయన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఫొటోలు ఎంతగానో దోహదపడతాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్‌ తోపాజి అనంత కిషన్‌, నాయకులు కూన వేణు, సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

డీఏఓ నర్సింహరావు

వట్‌పల్లి(అందోల్‌): అర్హత కలిగి ఉండి రుణమాఫీ కానీ రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలని డీఏఓ నర్సింహరావు సూచించారు. మంగళవారం మండలంలోని డాకూరు రైతు వేదికలో జరిగిన రైతు నేస్తంలో ఆయన పాల్గొన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందన్నారు. మండలంలో వరి సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ అరుణ, డాట్‌ సెంటర్‌ సైంటిస్ట్‌ శ్రీకాంత్‌ రాహుల్‌, సరిత మేడం ఏఓ శ్రీహరి వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాస్‌, రైతులు నరసింహారెడ్డి, అర్జున్‌, సత్యం తదితరులు పాల్గొన్నారు.

డీవైడర్‌ను ఢీకొన్న కారు

- సాఫ్ట్‌వేర్‌ ఇంజనీర్‌ మృతి
- సురక్షితంగా బయటపడ్డ కుటుంబం
- జోగిపేటలో విషాదం


జోగిపేట బస్టాండ్‌ ఎదుట పల్టీకొట్టిన కారు


అభిలాష్‌ (ఫైల్‌)

జోగిపేట(అందోల్‌): సోదరుడికి రాఖీ కట్టేందుకు భర్తతో కలిసి భార్య పుట్టింటి వెళ్తుండగా కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఇందులో అందరూ సురక్షితంగా బయటపడ్డారు. కానీ భర్త ఛాతినొప్పితో ఆస్పత్రికి తరలిస్తుండగా కన్నుమూశాడు. ఈ విషాదకర సంఘటన జోగిపేటలో జరిగింది. ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం... జోగిపేటకు చెందిన సార వెంకటేశం రెండేళ్ల క్రితం నాగోల్‌కు చెందిన అభిలాష్‌కు తన కూతురు సింధూను ఇచ్చి వివాహం చేశారు. రాఖీ పండుగ ఉండడంతో రాఖీ కట్టేందుకు కారులో సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయలుదేరారు. చందానగర్‌, పటాన్‌చెరులలో బంధువులను కలుస్తూ రాత్రి 11.45 ప్రాంతంలో జోగిపేటకు చేరుకున్నారు. బస్టాండ్‌ దగ్గరకు రాగానే కారు అదుపు తప్పడంతో డివైడర్‌కు ఢీకొట్టి బోల్తా కొట్టింది. కారులో బెలూన్‌లు తెరచుకొని పగిలిపోయినప్పటికీ అభిలాష్‌(33), భార్య సింధూ, ఏడాదిన్నర బాబు సురక్షితంగా బయటపడ్డారు. అంతలోనే అభిలాష్‌కు ఛాతిలో నొప్పిగా ఉందని అనిపించడంతో దగ్గరలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్సలు చేయించారు. వెంటనే పెద్దాస్పత్రికి తరలించాలని డాక్టర్‌ సూచించడంతో అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మార్గమధ్యలో గుండెపోటు రావడంతో మృతిచెందాడు. మృతుడి బంధువైన సార యాదగిరి జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు ను దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పాండు తెలిపారు. ఈ సంఘటనతో రెండు కుటుంబాల్లోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

- కుటుంబ కలహాలతో వ్యక్తి
- ఆర్థిక ఇబ్బందులతో బీజేపీ నేత కూడా


గౌసొద్దీన్‌ (ఫైల్‌)

కౌల్పారం(నర్సాపూర్‌): కుటుంబ కలహాల కారణంగా వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని చిన్న ఘనాపూర్‌ గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. కౌల్పారం ఎస్‌ఐ మహమ్మద్‌ గౌస్‌ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దూదేకుల గౌసొద్దీన్‌(50)కు భార్య, ఇద్దరు కుమారులు కూతురు ఉన్నారు. ఈనెల 19 సోమవారం భార్యాభర్తలు గొడవ పడగా పెద్ద కొడుకు ఇద్దరిని సముదాయించి బయటకు వెళ్లాడు. తర్వాత గౌసొద్దీన్‌ సైతం బయటికి పోయాడు. కొద్దిసేపటికే గ్రామ శివారులోని మర్రి చెట్టు కింద అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన కృష్ణ అనే వ్యక్తి.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దీంతో మొదట చికిత్స నిమిత్తం మెదక్‌ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీ ఆస్పత్రికి డాక్టర్‌ రిఫర్‌ చేశారు. ఇక్కడ చికిత్సపొందుతూ అతను మంగళవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


సాయిలు(ఫైల్‌)

కల్హేర్‌(నారాయణఖేడ్‌): ఆర్థిక ఇబ్బందులతో బీజేపీ నేత ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కల్హేర్‌ మండలంలో చోటుచేసుకుంది. కల్హేర్‌ ఎస్‌ఐ వెంకటేశం కథనం ప్రకారం..మండల మాజీ అధ్యక్షుడు, మాసాన్‌పల్లికి చెందిన పడమటి సాయిలు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబపోషణ భారంగా మారడంతో మనస్తాపం చెందాడు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మహదేవుపల్లి శివారులో సంగారెడ్డి–నాందేడ్‌ 161 జాతీయ రహదారి పక్కన చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య ప్రియాంక, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 15 తులాల బంగారం ఆభరణాలు, రూ. 80 వేల నగదు అపహరణ


ఇంట్లో చిందరవందరగా పడేసిన వస్తువులు

హత్నూర(సంగారెడ్డి): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన హత్నూర మండలం తార్యాన్‌పేటలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వంజరి ఆంజనేయులు, లావణ్య దంపతులు. భర్త వెంట రాగా పిల్లలను తీసుకొని భార్య సోమవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి రాఖీ కట్టడానికి పుట్టింటికి వెళ్లింది. మంగళవారం ఉదయం తిరిగొస్తే ఇంటి ప్రధాన తలుపుల తాళం పగులగొట్టి ఉండడం చూసి కుటుంబీకులు ఆందోళన గురయ్యారు. లోపలికి వెళ్లి చూడగా బెడ్‌ రూమ్‌ లో ఉన్న అలమారా తెరిచి ఉంది. చీరలు, నగలకు సంబంధించిన డబ్బాలు చిందరవందరగా పడేసి ఉన్నాయి. ఒక్కసారిగా ఆందోళన గురైన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. 15 తులాల బంగారు నగలతో పాటు రూ. 80 వేల నగదు పోయినట్లు పోలీసులకు తెలిపారు. ఎస్సై సుభాశ్‌ సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌ టీం ఆధారాలను సేకరిస్తుంది. బాధితుడు వంజరి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్‌ తెలిపారు.

కుక్కల దాడిలో జీవాల మృత్యువాత



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

మద్దూరు(హుస్నాబాద్‌): కుక్కల దాడిలో జీవాలు మృత్యువాతపడ్డాయి. ఈ సంఘటన మండలంలోని లద్నూరులో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేకల బాలయ్య గొర్రెల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నారు. సోమవారం గొర్రెలను మేత కోసం తీసుకెళ్లి రాత్రికి చేరుకొని దొడ్డిలో పంపి బంధువుల ఇంటిలో ఓ శుభకార్యానికి వెళ్లాడు. రాత్రి కుక్కలు దొడ్డిలో ఉన్న జీవాల మందపై దాడిలో చేయగా 10 జీవాలు మృతిచెందాయి. మరికొన్ని గాయపడ్డాయి. ఉదయం ఈ విషయాన్ని దొడ్డి పక్కనున్న రైతులు బాలయ్యకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించాడు. ఈ సంఘటనతో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. జీవాలతో నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సహాయం చేయబోతే.. సావుకొచ్చింది..

- డివైడర్‌ను ఢీకొట్టిన కారు
- గాయపడిన వారిని రక్షిస్తుండగా... ఆటో ఢీకొని వ్యక్తి మృతి


డివైడర్‌ను ఢీకొట్టిన కారు, పక్కన ఆటో


రామాగౌడ్‌(ఫైల్‌)

దుబ్బాకరూరల్‌: కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో గాయపడిన క్షతగాత్రులకు సాయం చేస్తున్నాడు. ఇంతలో అతడిని మృత్యువు రూపంలో ఆటో దూసుకొచ్చి ఢీకొనగా అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ వరుస సంఘటనలు దుబ్బాక రూరల్‌ మండలం చిట్టాపూర్‌ గ్రామం వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకున్నాయి. ఎస్‌ఐ హరీశ్‌ తెలిపిన వివరాలు... కామారెడ్డి జిల్లా బీబీపేటకు చెందిన రాజేందర్‌ తన కుటుంబీకులతో కలిసి కారులో సిద్దిపేట వైపు వెళ్తున్నాడు. అక్బర్‌పేట–భూంపల్లి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని చిట్టాపూర్‌ గ్రామం వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి 10 గంటలకు వీరు ప్రయాణిస్తున్న వాహనం డివైడర్‌ను ఢీకొట్టింది. అందులో ఉన్న అమూల్య(18), సిరి చందన(14)కు గాయాలయ్యాయి. తన ఇంటి ముందున్న జాతీయ రహదారిపై రాత్రి 10 గంటల సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దం వినబడగా.. చిట్టాపూర్‌ గ్రామ వాసి ఇర్కోటి రామాగౌడ్‌(64) బయటకు వచ్చి చూస్తే కారు డివైడర్‌ను ఢీకొట్టి ఉంది. హుటాహుటిన ఇక్కడికి చేరుకొని గాయపడ్డ వారిని బయటకు తీస్తున్నాడు. ఇదే క్రమంలో రామాయంపేట నుంచి సిద్దిపేట వైపు అతివేగంగా ఆటో వచ్చి రామాగౌడ్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పక్కనే ఉన్న అతడి మనవడికి స్వల్ప గాయాలయ్యాయి. రామాగౌడ్‌ మృతిచెందడంతో కుటుంబీకులు బోరున విలపించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.